## నేడు సొసైటీ ఎదుట బీఆర్ఎస్ ఆందోళన

**ఘట్‌కేసర్:** ఈనెల 22న ఘట్‌కేసర్ రైతు సొసైటీ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ఆందోళన చేపడుతామని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు,ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆదేశానుసారం ఉదయం 9గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,రైతులు పెద్ద ఎత్తన హాజరు కావాలని తెలిపారు.

### తూంకుంటలో
## ఎల్ ఆర్ఎస్ మేళా

**శామీర్‌పేట, ఆగస్టు 21:** తూంకుంట మున్సిపాలిటీ ప్రజలు ఎల్ఆర్ఎస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వెంకట గోపాల్ కోరారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు 2020లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి తమ ప్లాట్లను వెంటనే క్రమబద్ధీకరించుకొనేందుకు ఈ అవకాశం కల్పిస్తున్నదని తెలిపారు. గురువారం నుంచి ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న వారు వెంటనే మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసి తమ ప్లాట్లనుక్రమబద్ధీకరించుకోవాలని కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మేళా కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.హెల్స్ డెస్క్ సిబ్బంది పల్లె జీవన్ 8978146897, భానుచందర్ 9154279692ని సంప్రదించాలని కోరారు.

## రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

**ఘట్‌కేసర్,ఆగస్టు21:** రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటి వరకు రైతులకు రుణమాఫీ చేయకుండా రేవంత్ సర్కార్ వారిని మోసం చేస్తుందని మాజీ ఎంపీపీ, బీజేపీ నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఘట్‌కేసర్ రైతు సొసైటీ డైరెక్టర్లు, అధికారులు,బ్యాంక్ అధికారులను కలిసి రుణమాఫీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఘట్‌కేసర్ రైతు సొసైటీలో రుణాలు పొందిన 1230 మంది రైతులకు ఇప్పటి వరకు రుణమాఫీ జరగలేదని పేర్కొన్నారు. రెండు నెలల క్రితమే ఆడిట్ ప్రక్రియ పూర్తయినా, ఆడిట్ పూర్తికాలేదనే కుంటి సాకులతో రుణమాఫీ చేయకుండా సర్కార్ కాలయాపన చేస్తుందని ఆయన వివరించారు.వెంటనే సొసైటీలో రుణాలు రుణమాఫీ చేయక పోతే నియోజకవర్గం స్థాయిలో రైతులతో కలిసి ఆందోళన చేపడుతామని స్పష్టం చేశారు.

### వరదముంపు
## రాకుండా చర్యలు

**మల్కాజిగిరి, ఆగస్టు 21:** వరదముంపు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం బీజేఆర్ నగర్‌లో డ్రైనేజీ కాలువలను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లుతున్నాయన్నారు. ప్రస్తుతం వీటిలోని పూడికలను తొలగిస్తామని, కొత్త డ్రైనేజీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వాటర్ వర్క్స్ మేనేజర్ నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, బాబు, కిశోర్, సంతోష్, రాజు, సాయి, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితిని ఘనంగా నిర్వహిస్తాం..

**ఉప్పల్, ఆగస్టు 21:** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ అసెంబ్లీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాల సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లు, ఉత్సవ సమితి కార్యాచరణ, తదితర అంశాలపై చర్చించారు. ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ రెవెల్లి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఉప్పల్ అసెంబ్లీ కో కన్వీనర్ గోనె శ్రీకాంత్ అధ్యక్షత వహించారు.ముఖ్యఅతిథులుగా కేంద్ర కమిటీ సభ్యులు నాయిని బుచ్చిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరైనారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా ఉత్సవ కమిటీ ప్రతినిధులు సహకారం అందజేస్తారని తెలిపారు. ఉత్సవాలు ఘనంగా జరిగేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రమేష్, ప్రభాకర్, ఫణీందర్, గోపు సదానంద్, బలవంతచారి,కమల్, ప్రకాశ్ పాల్గొన్నారు.

## ఆడపిల్లలకు కరాటేలో ఉచిత శిక్షణ

**మేడ్చల్, ఆగస్టు 21:** ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని మేడ్చల్ పట్టణంలోని ఆడపిల్లలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కరాటే మాస్టర్ సాయికుమార్ కోరారు. రోజు రోజుకు మహిళలపై సమాజంలో జరుగుతున్న ఆకృత్యాలతో తనవంతు సామాజిక బాధ్యతగా ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.మేడ్చల్ పట్టణంలో విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులు వారి వీలును బట్టి వారి వారి పాఠశాలల్లో కానీ కాలనీల్లో కానీ, ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులైతే ఆర్టీసీ డిపోలో కాని వీలును బట్టి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వివరాలకు సాయికుమార్ 9014604209 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

# వారంలోగా సమస్యలు పరిష్కరించాలి



నాచారంలో వరదముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

- వరదముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన
- కాలనీల్లో నీరు నిలువడంతో అధికారులపై లక్ష్మారెడ్డి ఆగ్రహం
- వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశం

**ఉప్పల్, ఆగస్టు 21:** వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. నాచారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వరదనీటి సమస్యలు ఉన్న కాలనీల్లో బుధవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి కాలనీల్లో తిరుగుతూ, సమస్యలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కాలనీలో వరదనీరు నిలిచి ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యాన్‌హోల్స్‌లో పూడికతీతలు చేపట్టకపోవడంతోనే సమస్యలు వస్తున్నాయని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఇందిరానగర్‌లోని ట్రంక్‌లైన్ నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు పూడికతీతలు చేపట్టలేదని తెలిపారు. ట్రంక్ లైన్ మెయింటెనెన్స్ ఎవరు చూస్తున్నారని, అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. వారం రోజుల్లో ఫిర్యాదులు పరిష్కరించాలని ఆదేశించారు. నాచారం డివిజన్‌లో మళ్లీ పర్యటన చేస్తామని, అప్పటిలోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో ముందుకుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, జలమండలి జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం సతీష్, ఇంజినీరింగ్ ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ స్రవంతి, శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, ఎంటమాలజీ ఏఈ రమేశ్, నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



నాగారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

## మున్సిపల్ కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలి

**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 21:** మున్సిపల్ కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ నాగారం మున్సిపల్ కార్మికులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో కార్మికులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.శివారు మున్సిపాలిటీల్లో కార్మికులకు ఎక్కువ వేతనాలు ఇస్తున్నారని, నాగారం మున్సిపాలిటీలో తక్కువ వేతనం ఇస్తూ 9 గంటలు పని చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లనుడ్రైవర్లుగా గుర్తిస్తూ డ్రైవర్ల వేతనాలు ఇవ్వాలని, డ్రైవర్ల పని తప్ప వేరే పని వారితో చేయించరాదని అన్నారు. 8 గంటల కంటే ఎక్కువ పని చేయిస్తే ఓటి ఇవ్వాలని, నెలకు నాలుగు వేతనాలతో కూడిన సెలవులు ఇవ్వాలని కోరారు. గ్రామ పంచాయతీ నుంచి వచ్చిన కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించాలని, రూ. 20వేల వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఖాళీ ప్రదేశాల్లో యథేచ్ఛగా వ్యర్థాలు పారబోత



మేడ్చల్ మండలోని సోమారం గ్రామ శివారులో పారబోసిన వ్యర్థాలు

**మేడ్చల్ రూరల్, ఆగస్టు 21:** మేడ్చల్ మండలంలోని సోమారం గ్రామ శివారు ప్రాంతంలో గోదాముల నిర్వాహకులు వ్యర్థ పదార్థాలను పడవేస్తూ మనుషులు, పశువుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారు సర్వే నంబర్ 80 లోని ప్రభుత్వ స్థలంలో గతంలో గుర్తు తెలియని వాహనంలో తెచ్చి సీసాలు, ప్లాస్టిక్ చెత్త వేయగా రెండు రోజుల క్రితం కాలం చెల్లిన శీతల పానియాల సీసాలు పారబోసి వెళ్లారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమీపంలోని గోదాముల నుంచే ఈ వ్యర్థ పదార్థాలు తెచ్చి పోస్తున్నారని, మనుషులు, పశువులు తిరిగే ప్రాంతంలో ఇలాంటి వ్యర్థ పదార్థాలు వేయడంతో ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారులు స్పందించి పారవేసిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


## డ్రైనేజీ డైవర్షన్‌తో సమస్య పరిష్కారం:ఎమ్మెల్యే



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

**మల్కాజిగిరి, ఆగస్టు 21:** డ్రైనేజీని డైవర్షన్ చేయడంతో సమస్య పరిష్కారమైందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో శ్రీనగర్ కాలనీ ఇండస్ట్రీయల్ ఏరియా కెమికల్ వ్యర్థాలను డ్రైనేజీ ద్వారా డైవర్షన్ చేసి సమస్య పరిష్కరించడంతో నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ ఇండస్ట్రీయల్ ఏరియా నుంచి వచ్చే వ్యర్థాలవల్ల స్థానికులు అనారోగ్యాల బారినపడుతున్నట్లు గుర్తించామన్నారు. డ్రైనేజీలో రసాయనాలు కలువకుండా డైవర్షన్ చేయడంతో కొంతవరకు సమస్యను పరిష్కరించామని అన్నారు. ఇకముందు ఇటువంటి సమస్యలు రాకుండా పొల్యూషన్ కంట్రోల్ అధికారులతో కలిసి శాశ్వతంగా పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీం, నయిమ్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

**మేడ్చల్, ఆగస్టు 21:** ముఖ్యమంత్రి సహాయనిధిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలం గౌడవెల్లి గ్రామానికి చెందిన కంసమ్మ, యాదమ్మలు అనారోగ్యంతో బాధపడుతు వైద్య సేవలకు ఆర్థిక సాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తులు చేసుకున్నారు. మంజూరైన చెక్కులను బుధవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా కీసరి కంసమ్మకు రూ.60 వేలు, నాగులూరి యాదమ్మకు రూ.36 వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కృష్ణ, పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలల ధర్నా



అలియాబాద్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న మాలలు

**శామీర్‌పేట, ఆగస్టు 21:** ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని మాల మహానాడు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మోహన్ కృష్ణ అన్నారు. మాలల ఆత్మగౌరవ భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య పిలుపు మేరకు మండలంలోని అలియాబాద్ చౌరస్తా, శామీర్‌పేట, అలియాబాద్, ఉప్పర్‌పల్లి, లాల్‌గడి మలక్‌పేట తదితర గ్రామాల్లో ఆందోళనలు, ధర్నాలు నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ జిల్లాలో రాస్తారోకోలు, ధర్నా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలలు ప్రవీణ్, జహంగీర, రవి, శ్యామ్, సతీష్, హేమంత్, నవీన్, గోవర్ధన్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి



సుమారెసిడెన్సీలో వరద నీటితో ఏరులా పారుతున్న రోడ్లను పరిశీలిస్తున్న మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

**పీర్జాదిగూడ, ఆగస్టు 21:** కురుస్తున్న వర్షాలకు నగర ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం మొదటి డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలు అయోధ్యనగర్‌కాలనీ, సుమారెసిడెన్సీ కాలనీలోఆయన కాలనీవాసులతో కలిసి పర్యటించి వరద నీరు నిలిచి ఉన్న రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పార్కు స్థలాన్ని సబ్ స్టేషన్‌కు ఎలా కేటాయిస్తారు ?



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న విబిసిటీ గేటెడ్ కమ్యూనిటీ వాసులు

**మల్కాజిగిరి, ఆగస్టు 21:** విబిసిటీ గేటెడ్ కమ్యూనిటీకి కేటాయించిన పార్కు స్థలాన్ని విద్యుత్ సబ్ స్టేషన్‌కు బిల్డర్ ఇవ్వడంతో స్థానికులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. బుధవారం మచ్చ బొల్లారం డివిజన్ విబిసిటీ గేటెడ్ కమ్యూనిటీ మూడో ఫేజ్‌పక్కన 613గజాల స్థలాన్ని బిల్డర్ తమ అనుమతి లేకుండా సబ్ స్టేషన్‌కు ఇవ్వడంతో నిసరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు తెలియకుండా సబ్ స్టేషన్‌కు గిఫ్ట్ డీడ్ చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్ ఇక్కడ పనులు మొదలు పెట్టడంతో విషయం తెలిసిందని అన్నారు. గతంలో ఇదే విషయంపై కోర్టును ఆశ్రయించామని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## పిల్లలకు మెదడువాపు టీకాలు వేయించాలి

**మియాపూర్ , ఆగస్టు 21 :** ఆల్విన్ కాలనీ డివిజన్ శంషీగూడ వార్డు కార్యాలయంలో మెదడువాపు వ్యాధి నివారణ టీకాల ప్రక్రియను కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయసున్న చిన్నారులందరికీ విధిగా ఈ టీకాను తల్లిదండ్రులు వేయించాలని కోరారు.

### సమస్యలు పరిష్కరించాలని
## కలెక్టర్‌కు వినతి

**మేడ్చల్,ఆగస్టు 21:** మేడ్చల్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని కౌన్సిలర్ ఉమానాగరాజు అన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను బుధవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ నేషనల్ హైవే 44 మేడ్చల్ పట్టణంలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారిందన్నారు. కొత్త రోడ్డును ఏర్పాటు చేయాలని అందుకోసం ఎన్‌హెచ్ 44 అధికారులను ఆదేశించాలని కోరామన్నారు. అదే విధంగా పిల్లర్ నంబర్ 56 వద్ద చెరువుకు సంబంధించిన నాలా పూర్తిగా పూడుకుపోయిందని నీరు మొత్తం రోడ్డుపైకి వస్తున్నాయని, నూతన కల్వర్టు నిర్మించాలని విన్నవించినట్లు తెలిపారు.

### చెత్త వేసేందుకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలి

**ఉప్పల్, ఆగస్టు 22:** కాప్రా ఆదర్శనగర్ ఖాళీస్థలం వద్ద డంపింగ్‌ను నిలిపివేడంతో చెత్త ఆటో టిప్పర్ వాహనాల డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. చెత్త డంపింగ్‌కు సమీపంలో ప్రధాన రోడ్డుపై పరిసర కాలనీల నుంచి చెత్తను ఆటోటిప్పర్‌ల ద్వారా తరలించేందుకు వచ్చిన వాహనాలు దాదాపు యాభై వరకు రోడ్డుపై నిలిచిపోయాయి. ప్రతి రోజు పరిసర కాలనీలనుంచి తెచ్చిన చెత్తను ఇక్కడవేసేవారమనీ, ఇక్కడనుంచి భారీవాహనాల ద్వారా జవహర్‌నగర్‌కు చెత్తను తరలించేవారమని, అయితే నాలుగు రోజులుగా చెత్త డంపింగ్‌ను అడ్డుకోవడంతో తమకు దిక్కుతోచడం లేదని, తెచ్చిన చెత్తను ఎక్కడవేయాలో తెలియడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తమకు ప్రత్యామ్నాయ మార్గం చూపించకపోవడంతో రోడ్లపైనే తమ చెత్తవాహనాలను నిలిపివేయాల్సివస్తోందని అన్నారు. తమ సమస్యను సానుభూతితో పరిష్కరించాలని వారు కోరారు. పలువురు డంపింగ్ ఇక్కడే కొనసాగాలని నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. ఈ స్థలంలోనే డంపింగ్ ఉంటేనే ఇంటింటికీ వెళ్లి చెత్తను తీసుకొస్తామని వారు అన్నారు.

### ఉచిత వైద్య శిబిరానికి స్పందన

**కీసర, ఆగస్టు 21:** కీసరలోని కల్యాణ మండపంలో లయిన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. వైద్యులు రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించారు.

## విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

**మల్కాజిగిరి, ఆగస్టు 21:** పేదవిద్యార్థుల చదువులకు అండగా ఉంటామని రిటైర్ట్ తహసీల్దార్ శ్రీహరి అన్నారు. బుధవారం మచ్చబొల్లారం డివిజన్ కౌకూర్‌లోని ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు రిటైర్ట్ తహసీల్దార్ శ్రీహరి, రిటైర్ట్ బ్యాంక్ మేనేజర్ శ్రీరామ్‌లు విద్యార్థులకు ప్లేట్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మురళి, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

**శామీర్‌పేట, ఆగస్టు 21:** తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీగాయత్రి మహాక్షేత్రంలో రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాలు బుధవారం కన్నుల పండుగగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్‌వీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్ఛరణ మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించగా బృందావనం నుంచి బయటకు వచ్చిన స్వామివారు భక్తులకు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రశేఖరియాదవ్, సాయిబాబు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.


## జవహర్‌నగర్‌లో 10కిలోల గంజాయి పట్టివేత

జవహర్‌నగర్,ఆగస్టు 21: గుట్టుచప్పుడు కాకుండా ఒరిస్సా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నఅంతరాష్ట్ర గంజాయి ముఠాను మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌వోటీ సీఐ జానయ్య కథనం ప్రకారం... ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సాదన్ సర్కార్, విశ్వాస్, సర్ధార్, సుమంత్‌ఘోష్‌లు బొలెరో, ఎర్టీగా కార్లలో ఒరిస్సా నుంచి గుట్టుచప్పుడు కాకుండా తీసుకువచ్చిన గంజాయిని నగరానికి తరలిస్తున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు జవహర్‌నగర్‌లోని గోశాల సమీపంలో నిఘా పెట్టి కార్లలో తరలిస్తున్న 10కిలోల గంజాయి, 2 కార్లు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

### ఎర్రకుంట చెరువులో నిర్మాణం
# బిల్డర్‌పై కేసు నమోదు

దుండిగల్,ఆగస్టు 21 : బాచుపల్లిలోని ఎర్రకుంట ఎఫ్‌టీఎల్,బఫర్‌జోన్లను ఆక్రమించి అపార్ట్‌మెంట్‌లను నిర్మించిన బిల్డర్‌పై బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్,బాచుపల్లి మండలం సర్వే నంబర్ 134లోని ఎర్రకుంట చెరువు బఫర్,ఎఫ్‌టీఎల్ పరిధిలో మ్యాప్స్ ఇన్‌ఫ్రా పేరుతో పీ.సుధాకర్‌రెడ్డి అనే బిల్డర్ మూడు అపార్ట్‌మెంట్‌లను నిర్మిస్తున్నారు.నిర్మాణాలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఈ నెల 14న హైడ్రా ఐదు అంతస్థుల్లో నిర్మించిన మూడు అపార్ట్‌మెంట్‌లను నేలమట్టం చేశారు. ఈ నేపథ్యంలో బాచుపల్లి మండలం ఇరిగేషన్ ఏఈ సారా మంగళవారం ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టడంతో పాటు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన బిల్డర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఇరిగేషన్ ఏఈ ఫిర్యాదు మేరకు బిల్డర్ సుధాకర్‌రెడ్డిపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ● ప్రమాదకరంగా మ్యాన్‌హోల్..



నాచారం వెళ్లే రహదారిలో మ్యాన్‌హోల్ శిథిలమై పైనున్న కప్పు విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నది. అటుగా వెళ్తున్న వాహదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేసి పైకుప్పును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఓయూ పీజీ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 21: ఓయూ పరిధిలోని అన్ని పీజీ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ, ఎంఏ, ఎమ్‌కాం, ఎంకామ్ (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ తదితర కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 4 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించినప్పటికీ, యూజీసీ నెట్, టీజీ – సెట్ పరీక్షల నేపథ్యంలో వాటిని వాయిదా వేసినట్లు చెప్పారు. పరీక్షలు తిరిగి నిర్వహించే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

### లా కోర్సుల రీవాల్యుయేషన్ దరఖాస్తుల గడువు పొడగింపు

ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్ దరఖాస్తుల గడువును పొడగించినట్లు ప్రొఫెసర్ రాములు తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ కోర్సుల ఆరో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకాం, ఎల్ఎల్‌బీ కోర్సుల పదో సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈనెల 17వరకు స్వీకరించినట్లు చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 23వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

### ఎంపీఈడీ పరీక్ష ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని ఎంపీఈడీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను వెబ్‌సైట్ www.osmania.ac. inలో అందుబాటులో ఉంచారు.

**NOTICE**
**IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT BODHAN**
I.A.No. 103 OF 2024
in
I.A. No. 249 OF 2015
in
O.S.No. 49 of 2008
**Between:**
**Smt. Doddapaneni Sampoorna**
... Petitioner/Plaintiff/DHR
V/s
Yelamanchi Subramaneshwar Rao & others
... Respondents/Defendants
To
**Smt. Nadipineni Padmaja** W/o Satya Prasad Rao, Aged 42 years, Occup: Household, R/o Narepally, Ghatkesar Mandal, Ranga Reddy Dist (R-6)
That the Petitoner/DHR filed the above I.A. before this court with a request to direct the Tahsildar Varni to change the Registration in Sy.No. 318/1A1/2 in spite of 318/1A1/1 an extent of 14.60 guntas in "B" schedule property. The above case is stand posted on 27.08.2024 for your appearance before the Senior civil judge court Bodhan. Therefore you are hereby directed to appear before the above court on or before 27.08.2024 at 10.30 AM either personally or through pleader. If you fail to appear the matter will be heard exparte and decided on merits in your absence.
By Order of the Court
Sd/- **K. Subba Rao,** Advocate, Bodhan,
Cell No. 9440004201